పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చామని అధికారులు చెబుతున్నా.. సకాలం లో తూకం వేయకపోవడం రైతులకు శాపం గా మారింది. ధాన్యం ఆరబెట్టి విక్రయించేం దుకు తీసుకొస్తే కొనేవారు లేరు.. కల్లాల వద్ద రోజుల తరబడి వందల క్వింటాళ్ల ధాన్యం ఉంది. పూర్తిగా ఎండిన ధాన్యం అకాల వర్షా లకు ఎక్కడ తడిసిపోతుందోనన్న రైతులు ఆం దోళన చెందుతున్నారు.

- దొడ్డు వడ్లు వద్దంటున్న వ్యాపారులు
- ముఖం చాటేస్తున్న అధికారులు
- వర్షభయంతో అన్నదాతల్లో ఆందోళన


తూర్పారబట్టి విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం


కొనుగోలు కేంద్రంలో భారీగా నిల్వ ఉన్న ధాన్యం

ఇల్లెందురూరల్: మండలంలో ప్రస్తుత యాసంగిలో వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 1,038 ఎక రాల్లో వరి పంట సాగైంది. ఇందులో 808 ఎకరాల్లో సన్నరకం, 230 ఎకరాల్లో దొడ్డు రకం వడ్లు సాగ య్యాయి. సన్న రకం ఎకరానికి 28 క్వింటాళ్ల చొప్పున 22,624 క్వింటాళ్లు, దొడ్డు రకం ఎకరానికి 32 క్వింటాళ్ల చొప్పున 7,360 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. సన్నరకం క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320 కాగా దొడ్డు రకానికి రూ.2300. అయితే సన్న రకానికి క్వింటాకు అదనంగా రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. ఈ నేప థ్యంలో సన్నరకం సాగు చేసిన రైతులు ధాన్యం విక్రయించేందుకు నూరు శాతం ప్రభుత్వ కొను గోలు కేంద్రాలకే తరలిస్తున్నారు. ప్రస్తుతం వరికోత లు దాదాపు చివరి దశకు చేరుకోవడంతో ఇప్పటికే కోతలు పూర్తి చేసుకున్న రైతులు తేమశాతం కోసం ఆరబెట్టి, తూర్పాల బట్టి ధాన్యాన్ని కొనుగోలు కేం ద్రాలకు చేరుస్తున్నారు.

దొడ్డు వడ్లు కొనేందుకు కొర్రీలు..

మండలంలో రేపల్లెవాడ, కొమరారం కేంద్రంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ఆయా కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఆరు లారీల ద్వారా ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తరలించారు. ఇందులో రెండు లారీలు దొడ్డు వడ్లు కాగా, నాలుగు లారీలు సన్న రకం ధాన్యం ఉంది. అయితే తొలి దఫాగా దొడ్డు వడ్లు కొనుగోలు చేసిన మిల్లర్లు క్వింటాకు 3 కిలోలు కోత విధించినట్లు రైతులు చెపుతున్నారు. కాంటా సమయంలో కాకుండా మిల్లర్లు కొనుగోలు చేసిన తరువాత డబ్బులు చేతికందిన సమయంలో విషయం తెలియడంతో చేసేదిలేక రైతులు వచ్చిన ఆదాయాన్ని తీసుకొని ఇంటికి చేరుకున్నారు. అయితే ప్రస్తుతం కల్లంలో సుమారు ఐదు లారీలకు సరపడా దొడ్డు రకం వడ్లు నిల్వ ఉన్నాయి. గత నెల 25వ తేదీన తేమశాతం, తూర్పార బట్టి విక్రయిం చేందుకు రైతులు సిద్ధం చేశారు. నాటి నుంచి 11 రోజులు గడిచినా కొనుగోళ్లు చేపట్టకపవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అధికారు లు మాత్రం కారణం చెప్పకుండా రేపు, మాపు అం టూ కాలం వెళ్లదీస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తు న్నారు. ఇదిలా ఉండగా వర్ష భయం వెంటాడుతుం డటంతో కల్లాల వద్ద ధాన్యం తడుస్తుందో.. ఏమో అని రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసు కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు కాంటా పెడుతారో తెలియక రైతులు ఆవేదనకు గురవుతు న్నారు.

సన్నరకానికీ తప్పని జాప్యం..

అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సన్నరకం వడ్ల కాంటా, లోడింగ్‌లోనూ జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపా రుల ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు జోరందుకు న్నాయి. లారీలు అత్యధిక శాతం అటుగా ప్రయాణం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ కొను గోలు కేంద్రాల వద్ద ధాన్యం లోడింగ్‌కు ఇబ్బందిగా ఉందని రైతుల అంటున్నారు. అధికారులు స్పందిం చి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి వర్ష భయం నుంచి ఉపశమనం కలిగించాలని అన్న దాతలు కోరుతున్నారు.

11 రోజులుగా ఎదురు చూస్తున్నా...



దొడ్డు రకం వడ్లను రేపల్లెవాడ కొనుగోలు కేంద్రం వద్దకు చేర్చి తేమశాతం వచ్చే వరకు ఆరబెట్టి తూర్పాల పట్టాను. గత నెల 25వ తేదీ నాటికి కాం టాకు ధాన్యాన్ని సిద్ధం చేసిన. కానీ నేటి వరకు లారీలు రాలేదు. కాంటా పెట్టలేదు. వర్షభయం ఆం దోళన కలిగిస్తోంది.

– పత్తి ఉప్పలయ్య, రైతు, నిజాంపేట

దొడ్డు రకం కూడా కొంటాం..



ధాన్యం తేమ శాతం వచ్చేవ రకు ఆరబెట్టుకునేలా సౌకర్యా లు కల్పించాం. ఇప్పటి వరకు ఆరు లారీల ద్వారా సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశాం. దొడ్డు ధాన్యం విషయంలో మిల్లర్ల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకటిరెండు రోజుల్లో కొనుగోళ్లు చేస్తాం.

– హీరాలాల్, సీఈవో, పీఏసీఎస్ ఇల్లెందు

క్లుప్తంగా

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన


వెంగన్నపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామ పం చాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళ వారం భూమిపూజ నిర్వహించారు. మెయిన్ రోడ్డు పక్కనున్న ప్రభుత్వ స్థలంలో జీపీ భవనం, పబ్లిక్ టాయిలెట్స్, బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరు ణాకర్‌రెడ్డి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, పీఆర్ డీఈ నాగేందర్, ఏఈ కార్తీక్ రెడ్డి, ఐటీడీఏ డీఈ మధుకర్, ఏఈ యశ్వంత్ కుమార్, ఎంపీఓ తులసీరామ్ పాల్గొన్నారు.

శక్తిసదన్ హోం సందర్శన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం విద్యానగర్ కాల నీలోని శక్తిసదన్ హోంను మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం .రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు అందుతున్న సౌకర్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాట్లా డుతూ... శక్తిసదన్ హోంను సజావుగా నడపా లని, ఆశ్రయం, ఆహారం, దుస్తులు, వైద్యం, సంరక్షణ, వంటి ప్రాథమిక అవసరాల కోసం చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీరు సరఫరా చేయండి..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలో కిన్నె రసాని నీళ్ల రాక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని తక్షణమే తాగునీటిని విడుదల చేయా లని ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు శ్రావ ణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. మంగ ళవారం కొత్తగూడెం గాజులరాజం బస్తీలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజులుగా తాగునీళ్ల రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రతీనెల ఇలానే రోజుల తరబడి నీళ్ల రావడం లేదని బిల్లులు మాత్రం వసూలు చేస్తున్నారన్నారు.

జీఐఎస్‌పై అవగాహన ఉండాలి

పాల్వంచ: వ్యవసాయ, ఆరోగ్య రంగాల్లో జీయోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఎంతో ఉప యోగకరంగా మారిందని జిల్లా మైనార్టీ శాఖాధికారి సంజీవరావు అన్నారు. మంగళ వారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల లో ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు జీఐఎస్‌పై అవగాహన కల్పించారు. మాట్లా డుతూ.. ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఐఐటీ ముంబై ద్వారా ఇంటర్న్‌షిప్ ఇచ్చే విధంగా ప్రో త్సహించడం జరుగుతోందన్నారు. కార్యక్ర మంలో పలు కళాశాలల ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, సామాజిక సేవకుడు ఆదికోటేశ్వరరావు వాటర్ కూలర్‌ను మంగళవారం వితరణగా అందజే శారు. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ... ఆదికోటేశ్వరరావు పాఠశాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, పాఠశాలలో సరస్వతి విగ్రహం, పదో తరగ తిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థు లకు రూ.10 వేలు, రూ.5 నగదు బహుమతు లు, కిచెన్‌షెడ్ నిర్మాణం ఇతర కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు, మల్సూర్, అమీరుద్దీన్, ప్రధానోపాధ్యాయులు కొండల్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా

కొత్తగూడెంటౌన్: శ్రీపాండురంగ భజన మం దిరం ఆలయంలో మంగళవారం సుందరకాం డ ప్రవచనాల కార్యక్రమాన్ని లట్టి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈఓ కె.సులోచన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. సుందరకాండ, హను మాన్ జీవిత చరిత్రను వివరించారు.

వైద్య సిబ్బంది కృషి అభినందనీయం


సులానగర్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య తెలంగాణ ఏర్పాటుకు చేస్తున్న కృ షి అభినందనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం మం డలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మాట్లాడుతూ .. బాల్యవి వాహాలను అరికట్టాలని, ప్రభుత్వాస్పత్రిలో సుఖప్రసవాల సంఖ్యను పెంచాలని, సీజనల్ వ్యాధులను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండా లని తెలిపారు. ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యా ధికారి కందుల దినేష్, డాక్టర్లు కంచర్ల వెంకటేష్, విజయ శ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లల్లో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి

సింగరేణి(కొత్తగూడెం): వర్షపు నీటిని వృథా చేయ కుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భజలాలను రీచార్జ్ చేయాలన్న లక్ష్యంతో కలెక్టర్ జితేష్ వి.పా టిల్ ఆదేశాల మేరకు ప్రతీపాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయిందని రామవరం పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ డాక్టర్ ప్రభు దయాళ్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ఉన్నత పాఠ శాలలో ఇంకుండు గుంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. రామవరం , కూలీలైన్, ఆనందఖని ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలు నడుస్తున్నాయని, 6 నుంచి 9వ తర గతుల విద్యార్థు లు ఈ శిబిరాలను వినియోగించు కోవాలని కోరారు. దీంతోపాటు ఈనెల 7వ తేదీన పాఠశాలలకు గ్రీన్ బోర్డులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి


ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఎదుట ధర్నా చేశారు. పంచాయతీ కార్యదర్శులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు నాయిని రాజు, మాజీ ఎంపీటీసీ అజ్మీర బిచ్చా మాట్లాడుతూ.. పలు గ్రామపంచాయతీలలో అధికార పార్టీ నియమించిన ఇందిరమ్మ కమిటీలు అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి అర్హులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఒంటరి మహిళ లకు, వితంతువులకు, వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు, కూలీలకు మొదటి విడతలో ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం ప్రకటించినా కమిటీలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఎంపికలు పూర్తి చేశారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు రీసర్వే చేసి నిజమైన అర్హులను ఎంపిక చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, రాఘవులు, కోరం ముత్తమ్మ, శాంతారావు, రాములు, శ్రీరాం కోటయ్య, వీరన్న, సావిత్రి, లక్ష్మయ్య, బాలు, రవి, రామ్మూర్తి, తులసి, సత్యం పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గ్రామ కార్యదర్శులు, అధికారులు పారదర్శకంగా నిర్వ హించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. లబ్ధిదారుల పేర్లను పంచాయతీ నోటీసు బోర్డులో పెట్టాలని, అనర్హులను ఎంపిక చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి..

సుజాతనగర్: భూ భారతిలో భాగంగా నిర్వహిస్తు న్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఆర్డీఓ మధు అన్నారు. పాత అంజనాపురం, కొత్త అంజనాపురం రెండు గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై అవ గాహన కల్పించడంతో పాటు, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కా రమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమన్నారు. అనం తరం రైతులు పలు సమస్యలపై ఆర్డీఓకు వినతిప త్రాలు అందజేశారు.

నేడు రెవెన్యూ సదస్సులు...

సింగభూపాలెం, నరసింహసాగర్ గ్రామాల్లో బుధ వారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహ సీల్దార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

జూలూరుపాడు: ఉద్యోగులకు ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టు కోవాలని టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృ ష్ణ అన్నారు. మంగళవారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చాల్సిన సీఎం నేనేమీ చేయలేననడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులవి గొంతెమ్మ కోర్కెలు కావని, ఆర్థిక క్రమశిక్షణ పాటిం చే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు ధర్నాను విజయవంతం చేయండి..


సింగరేణి(కొత్తగూడెం): ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 8న హైదరాబాద్‌లో జరగ నున్న రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్క రించారు. మాట్లాడుతూ... అఖిల భారత ఐక్య రైతు సంఘం, ఆల్ ఇండియా రైతు జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రైతు కూలీల సమస్యలపై అన్ని స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు రైతులు పండించే అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి కిశోర్, జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, శ్రీను, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలను వ్యతిరేకించండి..

జూలూరుపాడు: భారతదేశంపై అమెరికా విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో దేశవ్యాప్తంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8న హైదరాబాద్ ఇం దిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగాల వీరభ ద్రం, తోటకూరి నరేష్, బోడా రత్న, కాలం సర స్వతి, బుజ్జి, హరి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత జాబితా ఖరారు

ఇల్లెందు: మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల తుది జాబితాను మంగళవారం విడుదల చేశారు. పేర్లు దక్కిన వారు వార్డుల వారీగా అతి తక్కువ మంది ఉన్నారు. జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందుతున్నారు. మొత్తం 1900 మంది అర్హులుగా ఉన్నట్లు పేర్కొన్న ఇం దిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు 357 మందిని మాత్రమే ఎంపిక చేసి ప్రకటించారు. కమిషన ర్ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ... మున్సిపా లిటీలో తొలి జాబితాను పారదర్శకంగా ఎం పిక చేసినట్లు తెలిపారు.

నేడు ఆరాధనా మహోత్సవం

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ పోతు లూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధ వారం ఆరాధనా మహోత్సవ పూజలు నిర్వ హించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యద ర్శి మోత్కూరి రవీంద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

కనీస వేతనాలు ఇవ్వండి..

సుజాతనగర్: ఈ నెల 20న జరగనున్న సార్వ త్రిక సమ్మె సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యం లో ఆశా కార్యకర్తలు మంగళవారం వైద్యా ధికారి డాక్టర్ రమేష్‌కు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. సీఐటీయూ నాయ కుడు వీర్ల రమేష్ మాట్లాడుతూ.. ఆశా కార్యక ర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆరోగ్య రంగానికి అత్యధిక నిధులు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండ మాల భాస్కర్, ఆశా కార్యకర్తలు తోళ్ల జయమ్మ, అనసూర్య, సునీత పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

పాల్వంచరూరల్: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపీ డీఓ కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. నిరు ద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. మండలంలో 2008 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోం దన్నారు. ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏఓ శంకర్, బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

పరదేశీయులను పంపించేయండి..


చుంచుపల్లి: కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా లో అక్రమంగా ఉంటున్న ఇతర దేశ ప్రజలు, పాకి స్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యాలను గుర్తించి వారిని ఆయా దేశాలకు పంపించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లా డుతూ.. ఈ విషయంపై ప్రజలు ప్రభుత్వ అధికారు లకు, పోలీసులకు సహకరించాలని కోరారు. అనం తరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీ రోహిత్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో పైడిపాటి రవీందర్, చింతల చెరువు శ్రీను, రంజిత్, శీలం విద్యాసాగర్, రాపాక రమేష్, క్రాంతి, మాలోత్ గాంధీ నాయక్, పెద్దిరెడ్డి గోపి, కృ ష్ణారెడ్డి, గుంపుల మహేష్, సతీష్, గొడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: వలస వచ్చి పాల్వంచ పట్టణ, మండలంలో నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి వెనక్కి పంపేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వివేక్‌కు మంగళవారం బీజేపీ నాయకు లు వినతిపత్రం అందజేశారు. స్థానిక బీజేపీ నాయ కులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రాంతంలో విదేశీయు లను గుర్తించి వారిని ఆయా దేశాలకు పంపాలని కోరుతూ బీజేపీ నాయుకలు మంగళవారం తహ సీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మావునూరి మాధవ్, శాసనాల రామయ్య, దోమల మహేశ్వర్, పెద్దబోయిన సునిత, జర్పుల రాంచం దర్, శివకుమార్ ఖండేల్‌వాల్, నాగరాజు, సూర్య వంశి, శుక్లాల్, రాజ్‌కుమార్‌పాసి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండల వ్యాప్తంగా నివసిస్తున్న ఇతర దేశస్తులను గుర్తించి వారిని స్వదేశాలకు పంపిం చాలని టేకులపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు తేజావత్ శంభునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరక తహసీల్‌లో డీటీ ముత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిక్క వెంకటే శ్వర్లు, మంగ్య నాయక్, పూన్యనాయక్, వినోద్ కుమార్, వెంకటేశ్వర్లు, జమాల్, అప్పారావు, గంగ తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..


సింగరేణి(కొత్తగూడెం): జీఎం పర్సనల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సింగరేణిలో కూడా మే 20న ఒకరోజు టోకెన్ సమ్మె చేసేందుకు ఏఐటీయూసీ నాయకులు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును మంగళవారం జీఎం పర్సనల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జన రల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేయాలని, 1931లో నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయరాదని, కార్మికులకు సొంతింటి కల అమలు చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో ..

ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయ ప్రదం చేయాలని కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డికి సమ్మె నోటీ సును అందజేశారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో పి.సతీష్, భూక్యా రమేష్, చంద్రశేఖర్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీలలో వైద్యసిబ్బంది మంగళ వారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భం గా సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేయ బోతున్నారని చెప్పారు. సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, వీరన్న, వజ్జ సుశీల, సుగుణ, చంద్ర కళ, మజహరి,విజయ, హైమావతి, రమణ తదిత రులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాపితంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయ ప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్‌నబీ పిలుపునిచ్చారు.

ఈ మేరకు మంగళవారం సులానగర్ పీహెచ్ సీలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లా డారు. అనంతర వైద్యాధికారికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరన్న, వజ్జ సుశీల, సుగుణ, చంద్రకళ, మజహరి, విజయ, హైమా వతి, తాళ్లూరి కృష్ణ, రమణ, విజయ, మల్లీశ్వరి , లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

మిషన్ భగీరథ కోసం రోడ్లు ధ్వంసం..

- ప్రణాళిక లేకపోవడంతో ఆర్థిక భారం
- అధికారులు సమన్వయం చేసుకోవాలంటున్న ప్రజలు



పంజాబుగడ్డ, నాగయ్యగడ్డ ప్రాంతాలలో రోడ్లను ధ్వంసం చేసిన దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఒక ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరిగిన తరువాత మరో ప్రభుత్వ శాఖ చేపట్టే అభివృద్ధి పనులతో మొదట జరిగిన అభివృద్ధి పనులు ధ్వంసం అవుతు న్నాయి. ఈ కారణంగా నిధులు వృథా అవుతు న్నాయి. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ఏడు వార్డులలో ఈ దుస్థితి నెలకొంది. పాత సీసీ రోడ్లతో పాటు ఇటీవల ప్రత్యేక నిధులతో నూతనంగా వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిం ది. రోడ్లన్నీ బాగున్నాయి, వర్షం వస్తే ఎలాంటి ఇబ్బంది లేదు అని ప్రజానీకం సంతోషపడుతున్న సమయంలో ప్రతీ ఇంటికి నల్లా ఇచ్చే క్రమంలో మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభ మయ్యాయి. ప్రతీరోడ్డుకు చివరిలో పాతపైప్‌లైన్లు లేదా నూతనంగా వేయాల్సిన పైపులైన్ వేయాల్సి రావడంతో సీసీ రోడ్లను పగులగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత రోడ్లతో పాటు నూతనంగా వేసిన రోడ్లను కూడా జేసీబీతో తవ్వడంతో రోడ్లు ధ్వంస మవుతున్నాయి. దీని కారణంగా రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథా అవుతున్నాయి. తిరిగి తవ్వకాలు జరిగిన చోట మళ్లీ రోడ్లు వేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్ల తవ్వకాలు జరుగుతున్న సమయంలో మున్సిపా లిటీ పైపులైన్లతో పాటు సింగరేణి క్వార్టర్లకు నీటి సరఫరా చేసేందుకు సంస్థ ఏర్పాటు చేసిన పైప్లు లెన్లు కూడా కొన్ని చోట్ల ధ్వంసం కావడంతో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. అసలే వేసవికాలం కావడం తో జరుగుతున్న అభివృద్ధి పనులు దీర్ఘకాలిక ప్రయోజనాలకు దోహదం చేస్తున్నా ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధికారుల చొరవతో మున్సిపల్ నీటి ట్యాంకుల ద్వారా కొంత ప్రజల నీటి సమస్యను తీరుస్తున్నా ఆశించిన స్థాయిలో తాగునీటి సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఒక శాఖకు సంబంధించిన అభివృద్ధిలను అధికారు లు సమన్వయంతో చేసేందుకు చర్యలు తీసు కోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులకు స్వస్తి పలకాలని పలువురు కోరుతున్నారు.

ముందు జాగ్రత్తలతో పనులు చేపట్టాలి..



ముందస్తు జాగ్రత్తలతో అభివృ ద్ధి పనులు చేపడితే ఇలాంటి సమస్యలు తలెత్తవు. అన్నిశా ఖలు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభి వృద్ధి పనులు చేపట్టాలి.

– ఆర్.శ్రీనివాసరావు